సాక్షి
ఒడిశా
శుక్రవారం । 19 । సెప్టెంబర్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.7,50,019లు, బంగారం 3 గ్రాముల 650 మిల్లీగ్రాము, వెండి 256 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



విపక్షాలు సిద్ధం

ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు ప్రతిపక్షాలు సిద్ధమయ్యాయి. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశాయి. - 8లో



మార్కెట్‌కు స్థలం కేటాయింపు

రాయగడలో డైలీ మార్కెట్‌కు స్థలం కేటాయించారు. అనుమతులు కూడా జారీ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

రాయగడ: స్థానిక సిరిగుడ సమీపంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం రక్తదాన శిబిరాన్ని ఆ పార్టీ శ్రేణులు నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు పురస్కరించుకొని నిర్వహించిన శిబిరంలో 75 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యకర్తలు, యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు కాలీరాం మాఝి, ఆ పార్టీ సీనియర్ నాయకుడు బసంత కుమార్ ఉలక, బీజేపీ యువ మోర్చ జిల్లా అధ్యక్షుడు ఉమేష్ ఖోష పాల్గొన్నారు.

హత్య కేసులో ఐదుగురు అరెస్టు



మత్తిలి పోలీసులు అరెస్టు చేసిన నిందితులు



మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి కురుమ్‌పల్లి గ్రామంలో చేతబడి నెపంతో ఒకరిని హత్య చేసి పరారైన ఐదుగురిని గురువారం మత్తిలి పోలీసులు అరెస్టు చేశారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో నిరంజన్ ఠాకూర్ అనే వ్యక్తి చేతబడి చేస్తున్నాడనే అనుమానంతో గత శనివారం హత్య చేశారు. హత్యకు వాడిన గొడ్డలి ఎవరికీ దొరక్కుండా జాగ్రత్త పడ్డారు. అనంతరం పోలీసులు దర్యాప్తు ప్రారంభించి నిందితులను పట్టుకున్నారు. ప్రధాన నిందితుడు ప్రధాప్ పూజారి, దినేశ్ నాయక్, జగన్నాథ్ నాయక్, మిధున్ నాయక్, బినోద్ నాయిక్‌లను అరెస్టు చేశారు. హత్యకు వాడిన గొడ్డలి చెరువులో వేయగా దాన్ని స్వాధీనం చేసుకున్నారు.

అక్టోబర్ 6 నుంచి గజలక్ష్మి పూజలు



పూజలకు ముహూర్తపు రాట వేస్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక న్యూకాలనీలో అక్టోబర్ 6 నుంచి గజలక్ష్మి పూజలు ప్రారంభమవుతాయి. దీనికి సంబంధించి గురువారం ముహూర్తపు రాటను కమిటీ సభ్యులు వేశారు. 12 రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాలు సెప్టెంబర్ 17తో ముగుస్తాయని కమిటీ సభ్యులు తెలియజేశారు. ఉత్సవాలను పురస్కరించుకొని ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడిగా సంతోష్ కుమార్ పాత్రో, ఉపాధ్యక్షుడిగా బినోద్ కుమార్ సాహు, కార్యదర్శిగా ఎన్. త్రినాథరావు, కోశాధికారిగా దిలీప్ సాహు, సహ కార్యదర్శిగా సంతోష్ కుమార్ బ్రహ్మ, లక్ష్మీకాంత్ దాస్, సురేష్ చంద్ర సామంతరాయ్‌లు నియమితులవ్వగా, ముఖ్య సలహాదారులుగా సవ్యసాచి సాహు, రాం ప్రసాద్ పాత్రోలు వ్యవహరిస్తారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గత 30 ఏళ్లుగా అందరి సహకారంతో గజలక్ష్మి పూజలను నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించేందుకు సన్నహాలు చేస్తున్నట్లు అధ్యక్షుడు సంతోష్ కుమార్ పాత్రో తెలియజేశారు.

గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితులు

రాయగడ: జిల్లాలోని అంబొదల పోలీసులు బుధవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో గంజాయితో ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి నుంచి 24.610 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. అరెస్టయిన వ్యక్తులు కలహండి జిల్లా కునాగుడ గ్రామానికి చెందిన వశిష్ఠ మెహేర్, థబీర్ మెహర్‌లుగా గుర్తించగా.. మరో నిందితుడు బుడిపాదొరొ గ్రామానికి చెందిన హరిహర్ మెహర్‌గా గుర్తించారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం బుధవారం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో అంబొదల రైల్వేస్టేషన్ సమీపంలో ముగ్గురు వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించడంతో వారి బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది.

రత్న భాండాగారానికి..
ఆభరణాల పెట్టెల తరలింపు



శ్రీ మందిరం (ఫైల్)

- ఈ నెల 23 ముహూర్తం

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథ ఆలయంలో రత్న భాండాగారానికి స్వామి అమూల్య రత్న సంపదని సురక్షితంగా తరలించేందుకు ముహూర్తం ఖరారైంది. నిర్వహణ, మరమ్మతు కార్యకలాపాలు పురస్కరించుకుని భాండాగారంలో రెండు మిద్దెలపై ఉన్న భగవంతుని బంగారు, వెండి ఆభరణాలు, నగలు, పాత్రలు వగైరా అమూల్య సంపదని తాత్కాలికంగా వేరే చోట పెట్టెల్లో భద్రపరిచారు. భారత పురావస్తు శాఖ ఏఎస్ఐ ఆధ్వర్యంలో ఈ పనులు పూర్తి కావడంతో యథాతథంగా ఈ సొత్తుని తరలించేందుకు నిర్ణయించారు. ఇటీవల పూరీ గజపతి మహారాజా దివ్య సింగ్ దేవ్ అధ్యక్షతన జరిగిన శ్రీ మందిరం పాలక మండలి సమావేశంలో భాండాగారానికి రత్న సంపద తరలింపు కోసం ప్రత్యేకంగా ఉప కమిటీ ఏర్పాటు చేశారు. ఆ కమిటీ పర్యవేక్షణలో భాండాగారానికి రత్న సంపదని యథాతథంగా సురక్షితంగా తరలించేందుకు సకల ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర న్యాయ, నిర్మాణం, అబ్కారీ శాఖ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతు శ్రీ మందిరంలో రత్న వేదికపై కొలువు దీరిన మూల విరాటుల్ని భక్తులు, యాత్రికులు సంతృప్తికరంగా దర్శించేందుకు వీలుగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. త్వరలో వరుసన క్రమంలో మూల విరాటుల దర్శనం కోసం సన్నాహాలు చేస్తున్నారు. భాండాగారానికి రత్న సంపద తరలించడంతో శ్రీ మందిరం ప్రాంగణంలో నెలకొని ఉన్న హుండీని స్థానాంతరం చేయాలని నిర్ణయించారు. శ్రీ జగన్నాథ ఆలయ పాలక వర్గం (ఎస్‌జేటీఏ) మరియు పూరీ జిల్లా కలెక్టర్‌తో చర్చించిన తర్వాత హుండీ తరలింపు కోసం కచ్చితమైన స్థలం ఖరారు చేస్తారు. హుండీ తరలించడంతో రత్న వేదికపై మూల విరాట్ల వరుస దర్శనం ప్రయోగాత్మకంగా చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ చర్యల కోసం ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝితో సంప్రదించి ఆమోదం పొందినట్లు వివరించారు. దీంతో ప్రధాన దీర్ఘ కాలిక సమస్యలు పరిష్కృతం అవుతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ నెల 23న ఆభరణాల తరలింపు

ఈ చర్య దర్శన ప్రక్రియను క్రమబద్ధీకరించి భక్తులకు సులభ దర్శనం వ్యవసీకృతంగా మలచడం ధ్యేయంగా పేర్కొన్నారు. మరో కీలకమైన పరిణామంలో భాగంగా రత్న భాండాగారం ఉపసంఘం నిర్ణయం మేరకు ఆభరణాలతో నిండిన పెట్టెలను ఈ నెల 23న ఆలయ పవిత్ర రత్న భాండాగారానికి తరలిస్తామని మంత్రి ప్రకటించారు. ఆలయ పరిపాలన, ఉన్నత స్థాయి కమిటీ సమక్షంలో పారదర్శకత, సంప్రదాయానికి కట్టుబడి అమూల్య రత్న సంపదని తరలిచండం జరుగుతుందన్నారు. శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి సీఏఓ డాక్టరు అరవింద కుమార్ పాఢి అధ్యక్షతన జరిగిన రత్న భాండాగారం ఉప కమిటీ సమావేశంలో తాత్కాలిక ప్రాంగణం నుంచి రత్న సంపదని పవిత్ర రత్న భాండాగారానికి యావత్ సొత్తుని తరలించేందు కార్యాచరణ ఖరారు చేశారు. ఈ నెల 23వ తేదీ ఉదయం 4 గంటలకు ద్వారాలు తెరవడంతో శుభ ఘడియల్లో ఈ ప్రక్రియ ప్రారంభిస్తారు. ఏదైనా కారణం చేత ఆ రోజున నగలు, ఆభరణాలు వగైరా తరలింపు పూర్తి కాకపోతే మరుసటి రోజు సెప్టెంబర్ 24న కొనసాగిస్తారు. స్వామి ఆభరణాల తరలింపు వ్యవధిలో సర్వ దర్శనం పరిమితం చేస్తారు. ఆభరణాలను రత్న భాండాగారంలో ఉంచిన తర్వాత మెజిస్ట్రేట్ సమక్షంలో తలుపులు సీలు చేస్తారు. తాళాలు జిల్లా ఖజానాకు అందజేస్తారు. 1978 సంవత్సరం నాటి అధికారిక జాబితా ప్రకారం సొత్తు వివరాలు ధృవీకరిస్తారు. ఆభరణాల జాబితా లెక్కింపు మరియు మూల్యాంకనం సంబంధిత అంశాలపై పాలక మండలి నిర్ణయాలు తీసుకుంటుంని సీఏఓ వివరించారు.

ప్రభుత్వంపై కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం



శాసన సభ కార్యదర్శికి స్పీకరుని ఉద్దేశించిన అవిశ్వాస తీర్మానం ప్రతిపాదన సమర్పించిన కాంగ్రెస్ ఎమ్మెల్యేల బృందం



బీజేడీ ఎమ్మెల్యే ప్రతాప్ కేశరి దేవ్‌ని సంప్రదించిన కాంగ్రెస్ ఎమ్మెల్యేల బృందం

భువనేశ్వర్: ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించింది. శాసన సభ కార్యదర్శి ద్వారా స్పీకర్‌కు ఈ ప్రతిపాదన అందజేసింది. ఈ తీర్మానానికి 15 మంది పార్టీ ఎమ్మెల్యేల ముందస్తు మద్దతుతో ప్రతిపాదన దాఖలు చేసింది. 14 మంది కాంగ్రెస్, ఒక సీపీఐఎం ఎమ్మెల్యే ప్రభుత్వ వ్యతిరేక అవిశ్వాస తీర్మానానికి మద్దతు ప్రకటించారు.

విపక్షం సాయం కోసం నిరీక్షణ

ప్రభుత్వ వ్యతిరేక అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో కాంగ్రెస్ ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్ సహాయ సహకారాల కోసం నిరీక్షిస్తుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెసు శాసన సభ నాయకుడు రామచంద్ర కదమ్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం ప్రతిపక్ష బిజూ జనతా దళ్ నాయకుల్ని కలిసింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహినీపతి మాట్లాడుతూ బిజూ జనతా దళ్ మద్దతు కోసం ఎమ్మెల్యే ప్రతాప్ కేశరి దేవ్‌ని సంప్రదించినట్లు తెలిపారు. పార్టీ సమావేశంలో ఈ విషయంపై చర్చించి తమ నిర్ణయం తెలియజేస్తామని అభయం ఇచ్చినట్లు తెలిపారు.

ఒంటరిగానైనా అవిశ్వాసం తెస్తాం: రాజన్ ఎక్కా

ప్రభుత్వానికి ధైర్యం ఉంటే అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొంటుందని, ప్రజలు ప్రభుత్వంపై నమ్మకం కోల్పోయారు. ప్రజలకు ప్రభుత్వంపై విశ్వాసం లేక పోవడంతో మేము అవిశ్వాస తీర్మానం తీసుకువచ్చామని కాంగ్రెసు ఎమ్మెల్యే రాజన్ ఎక్కా తెలిపారు. ఈ మేరకు బీజేడీని అవిశ్వాస తీర్మానం తీసుకురావాలని అభ్యర్థించాం. వారు అవిశ్వాస తీర్మానం తీసుకురాకపోతే, మేము దాన్ని తీసుకువస్తామని ముందుగానే స్పష్టం చేశాం. ఈ క్రమంలో కాంగ్రెస్ గురువారం అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించిందని రాజన్ ఎక్కా వివరించారు. ఈ పరిస్థితుల్లో విపక్ష బిజూ జనతా దళ్ కాంగ్రెస్‌కు మద్దతుగా నిలుస్తుందా లేదా సభలోనే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతుందా? అనే సందిగ్ధత సర్వత్రా నెలకొంది. ఇంత వరకు బీజేడీ కాంగ్రెసు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి మద్దతు విషయం స్పష్టం చేయలేదు.

ప్రభుత్వానికి ఒరిగేదేం లేదు

మరోవైపు అవిశ్వాస తీర్మానం ఆమోదం పొందితే ప్రభుత్వానికి ఎలాంటి ప్రమాదం లేదని అధికార పక్షం ధీమా వ్యక్తం చేస్తుంది. సభలో సంఖ్యా గరిష్టతతో ఈ ధీమా వ్యక్తం చేస్తుంది. కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం ప్రతిపాదిస్తే పార్టీకి ఎలాంటి నష్టం జరగదు. రాష్ట్ర శాసన సభలో మొత్తం 147 స్థానాలు. వాటిలో ఒక స్థానం ఖాళీగా ఉంది. విపక్ష బిజూ జనతా దళ్ అభ్యర్థి రాజేంద్ర ఢొలొఖియా అకాల మరణంతో ఈ ఖాళీ ఏర్పడింది. అధికార పక్షం భారతీయ జనతా పార్టీ బలం అత్యధికంగా 78 మంది సభ్యులు కాగా విపక్ష బిజూ జనతా దళ్ బలం 50, కాంగ్రెస్‌కు 14 మంది సభ్యుల బలం కొనసాగుతుంది. వామపక్షం (సీపీఎం) 1, ఇతరులు 3 మంది సభ్యులు ఉన్నారు. అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా విపక్షాలతో సహా ఇతర సభ్యులు చేయి కలిపిన మొత్తం బలం 68కి పరిమితం అవుతుంది. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రభుత్వానికి ఎటువంటి ప్రమాదం లేదని అధికార పక్షం నిశ్చలత ప్రదర్శిస్తుంది.

నదిలో కొట్టుకుపోయి ఒకరు మృతి



నది ఒడ్డున మృతదేహం

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి నాయక్‌గూఢ పంచాయతీ మాలిగూడ సమీపంలో గారియా నదిని దాటే క్రమంలో ఒకరు మృతి చెందారు. గురువారం ఉదయం నీటి నుంచి ఓ మృతదేహం నదిలో కొట్టుకుపోవడం చూసిన స్థానిక మహిళలు కేకలు వేయడంతో సమీపంలో ఉన్న వారు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి, మత్తిలి పోలీసులకు సమాచారం అందజేశారు. వారు వచ్చి మృతదేహాన్ని బయటకు తీశారు. ఖోయిర్‌పూట్ సమితి ఫోఢఘాటా పంచాయతీ శుక్రగూడ గ్రామానికి చేందిన హాతి గురుతేలి(50)గా గుర్తించారు. నాయక్ గూడలో జరిగే వారపు సంతకు వచ్చి తిరిగి వెళ్తుండగా నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడని భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

బాలుడు ఆత్మహత్య

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి గంపాకొండ పంచాయతీ ఎంవీ 105 గ్రామంలో సంజాయ్ ప్రభుత్వ అనే 13 ఏళ్ల బాలుడు గురువారం ఇంటిలో ఎవరూ లేని టైమ్ చూసుకుని ఉరి వేసుకున్నాడు. తల్లి శెఫాలి ప్రభుత్వ మిషన్ శక్తిలో సీఆర్పీగా పనిచేస్తున్నారు. తండ్రి శ్యామల్ ప్రభుత్వ రోజు కూలీ. తల్లిదండ్రులిద్దరూ పనికి వెళ్లి భోజన సమయానికి వచ్చి చూసే సరికి బిడ్డ ఉరికి వేలాడుతూ కనిపించాడు. దీంతో ఇరుగు పొరుగు వారిని పిలవగా వారు పోలీసులకు సమాచారం అందజేశారు. ఐఐసీ ముకుందో మేల్కా తన సిబ్బందితో వచ్చి విచారించగా బాలుడు మానసిక సమస్యతో బాధ పడుతున్నట్లు తెలిసింది. మృతదేహాన్ని కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

భువనేశ్వర్: రాష్ట్రంలో పాఠశాల విద్యార్థులకు బస్సు ప్రయాణం ఉచితమని ప్రకటించారు. ముఖ్యమంత్రి బస్సు సేవ (ఎంబీఎస్) పథకం కింద పాఠశాల విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర పాఠశాలలు, సామూహిక విద్యాశాఖ అధికారికంగా తెలియజేసింది. ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాల విద్యార్థులు చెల్లుబాటు అయ్యే విద్యార్థి గుర్తింపు కార్డును చూపించడం ద్వారా లేదా వారి పాఠశాల యూనిఫాం ధరించడం ద్వారా ప్రభుత్వ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించడానికి అర్హులు అవుతారు. అమలు సజావుగా ఉండేలా చూసేందుకు, గరిష్ట సంఖ్యలో పాఠశాలలను కార్యాచరణ నెట్‌వర్క్ పరిధిలోకి తీసుకురావడానికి వీలుగా ఒడిశా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఓఎస్‌ఆర్‌టీసీ) ప్రస్తుత బస్సు రూట్లు మరియు సమయాలను పునః సమీక్షించాలని ఆదేశించారు. బస్సు రూట్లను తిరిగి మ్యాప్ చేయడానికి అవసరమైన వివరాలను అందించాలని జిల్లా విద్యా అధికారులకు కూడా ఆదేశాలు జారీ చేయబడ్డాయి. పథకం వల్ల కొంత ఆదాయ నష్టం వాటిల్లుతుందని భావిస్తున్నందున, వాణిజ్య మరియు రవాణా శాఖ అవసరమైన బడ్జెట్ మద్దతును అందిస్తుందని ప్రభుత్వం హామీ ఇచ్చింది. రాష్ట్ర పాఠశాలలు, సామూహిక విద్యాశాఖ కమిషనర్, కార్యదర్శి షాలిని పండిట్ పథకం అమలుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ చొరవ విద్యార్థులకు, ముఖ్యంగా సెమీ అర్బన్ మరియు గ్రామీణ ప్రాంతాలకు రవాణా సవాళ్లను గణనీయంగా తగ్గిస్తుందని, పాఠశాల హాజరును ప్రోత్సహిస్తుందని మరియు తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తుందని భావిస్తున్నారు. సత్వర చర్యల కోసం ఓఎస్‌ఆర్‌టీసీ సీఎండీ, అన్ని రెవెన్యూ డివిజనల్ కమిషనర్లు మరియు కలెక్టర్లకు ఆదేశించారు.

తీర్థయాత్రలకు 72 మంది ప్రయాణం



పచ్చజెండా ఊపి యాత్ర ప్రారంభిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ జి.తిరుపతి రావు

పర్లాకిమిడి: ప్రభుత్వ వయోవృద్ధుల తీర్థయాత్రల పథకంలో భాగంగా వారణాసి, అయోధ్యకు గురువారం రెండు బస్సులను జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతి రావు, పురపాలక సంఘం చైర్మన్ నిర్మలా శెఠి పచ్చజెండా ఊపి గజపతి స్టేడియంలో ప్రారంభించారు. ఆరు రోజుల అయోధ్య, వారణాసి తీర్థయాత్రలకు గజపతి జిల్లా నుంచి 72 మంది వయోవృద్ధులు టూరిజం శాఖ ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న పిమ్మట లాటరీ తీసి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గజపతి ఇండోర్ స్టేడియంలో వయో వృద్ధులకు భోజనాలు ఇప్పించి, వారికి ఆరోగ్యం తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీర్థయాత్ర పథకం గత రెండేళ్ల నుంచి అమలు చేస్తోంది. యాత్రికులు పర్లాకిమిడి నుంచి బరంపురం చేరుకుని శుక్రవారం వేకువజామున ప్రత్యేక తీర్థయాత్రల రైలుబండిలో బయలు దేరనున్నట్టు ఏడీఎం (రెవెన్యూ) మునీంద్ర హానగ యాత్రికులకు వివరించారు. వయోవృద్ధులు బరంపురానికి చేరుకునే లోపు ప్రతి ఒక్కరికీ ఐటెంటిటీ కార్డులు అందజేస్తామని, ఎలాంటి పరిస్థితిలో వాటిని తీయరాదని డీసీపీయూ త్రిపాఠి సూచించారు. జిల్లా పరిషత్ చైర్మన్ గవర తిరుపతి రావు తెలుగులో మాట్లాడుతూ, తీర్థయాత్ర చేస్తున్న వయోవృద్ధులకు తోడుగా మెడికల్ టీమ్ ఉంటుందని, ఇద్దరు అధికారులు కూడా వస్తారని తెలిపారు. యాత్రలకు వెళ్లిన వారు తిరిగి క్షేమంగా ఇంటికి చేరుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని పురపాలక సంఘం చైర్మన్ నిర్మలా శెఠి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాధికారి లవనేందు మహంతి, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా మంగరాజ్, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి అరుణ్ కుమార్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ సిటిజన్ తీర్థయాత్రల ప్రారంభ సభలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ గవర తిరుపతిరావు



తీర్థయాత్రకు బయలుదేరుతున్న వయో వృద్ధులు

సంతాపంతో ముగిసిన తొలి రోజు సభ

- నేటికి వాయిదా

భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభ వర్షాకాల సమావేశాలు గురు వారం నుంచి ప్రారంభమయ్యాయి. స్పీకర్, ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు సభకు సకాలంలో హాజరయ్యారు. స్పీకర్ అనుమతి మేరకు ఉదయం 11 గంటల నుంచి సభా కార్యకలాపాలు ఆరంభమయ్యాయి. అంతకు ముందు శాసన సభ ఆవరణలో స్పీకర్‌కు గౌరవ కవాతుతో స్వాగతించారు. సభా కార్యకలాపాలు ఆరంభానికి స్పీకర్ అనుమతి లభించడంతో ముఖ్యమంత్రి దివంగత సభ్యులకు సంతాప తీర్మానం ప్రతిపాదించారు. ప్రతిపాదనకు ఆమోదం లభించడంతో ఏడుగురు మాజీ సభ్యులు, ఇద్దరు రాష్ట్ర పోలీసు సిబ్బంది మృతిపై సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి దివంగతులకు ఘనంగా నివాళులర్పించారు. తోటి సభ్యులు ధాజేంద్ర ఢొలొకియా, కరేంద్ర మాఝీలతో కలిసి పని చేసిన అనుభవాల్ని ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించిన ఇద్దరు కానిస్టేబుళ్ల త్యాగాన్ని ఆయన ప్రశంసించారు. అనంతరం సభ కార్యకలాపాలు వాయిదా వేసినట్లు స్పీకర్ సురమా పాఢి ప్రకటించారు. మర్నాడు శుక్రవారం ఉదయం ఆరంభం సమయం వరకు సభా కార్యకలాపాలు నిరవధికంగా వాయిదా పడినట్లు ఆదేశించారు.

ఈ సందర్భంగా దివంగత నువాపడా నియోజకవర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే రాజేంద్ర ఢొలొకియా, మాజీ డిప్యూటీ స్పీకర్ బిభూతి భూషణ్ సింగ్ మర్దరాజ్, మాజీ సభ్యులు ప్రసన్న పట్నాయక్, కరేంద్ర మాఝి, నిరంజన్ హేంబ్రమ్, ప్రఫుల్ల కుమార్ భంజ్, మహ్మద్ రఫీక్ మరియు పోలీసు జవానులులోక్‌నాథ్ సబర్, లక్ష్మణ్ మాఝి మృతి పట్ల నివాళులు అర్పించారు. దివంగత సభ్యులకు గౌరవ సూచకంగా ఎమ్మెల్యేలు 2 నిమిషాలు లేచి నిలబడి మౌనం పాటించారు. విపక్ష బిజూ జనతా దళ్ ఉప నాయకుడు డాక్టరు ప్రసన్న ఆచార్య, కాంగ్రెస్ శాసన సభా పక్ష నాయకుడు రామ చంద్ర కదమ్, భారత కమ్యూనిస్టు పార్టీ (ఎం) ఏకైక సభ్యుడు లక్ష్మణ్ ముండా దివంగత నాయకులు, పోలీసు సిబ్బందికి తమ సంతాపం తెలిపారు. సభ తరఫున దివంగత సభ్యులు, కానిస్టేబుళ్ల కుటుంబాలకు స్పీకర్ సంతాపాన్ని తెలియజేశారు. ఆమె తన సంతాప సందేశంలో ప్రతి మాజీ సభ్యుడి సహకారాన్ని కూడా ప్రస్తావించారు. రాజేంద్ర ఢొలికియా కొనసాగుతున్న 17వ సభ సిట్టింగ్ సభ్యుడు కాబట్టి సంప్రదాయం ప్రకారం తొలి రోజు సభ కార్యకలాపాలు వాయిదా వేసినట్లు స్పీకర్ పేర్కొన్నారు. గురు వారం ప్రారంభమైన శాసన సభ వర్షాకాల సమావేశాలు సెప్టెంబర్ 21న ఒక విరామంతో సెప్టెంబర్ ఈ నెల 25 వరకు స్వల్పంగా 7 రోజుల నిడివితో కొనసాగాల్సి ఉంది. ఈ వ్యవధిలో ఈ నెల 21 విరామ దినంగా ప్రకటించారు.



వానా కాలం సమావేశాలు ఆరంభం పురస్కరించుకుని గౌరవ వందనం స్వీకరించిన శాసన సభ స్పీకర్ సురమా పాఢి



శాసన సభ సమావేశాలకు హాజరవుతున్న స్పీకర్



సభలో సంతాప తీర్మానం ప్రతిపాదించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

క్లుప్తంగా

9 అడుగుల నల్లతాచు పట్టివేత



దారా పోడియమి ఇంటిలో పట్టిన నల్లతాచు పాము

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితిలోని జాఖాల్‌గూఢ గ్రామంలో దారా పోడియామి అనే వ్యక్తి ఇంటిలోకి గురువారం మధ్యాహ్నం నల్లతాచు ప్రవేశించింది. కుటుంబ సభ్యులు గమనించడంతో స్నేక్ హెల్ప్‌లైన్ సభ్యుడు రాకేష్ హల్దార్‌కు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పామును పట్టుకున్నారు. తూకం వేయగా 6 కిలోల బరువు, 9 అడుగుల పొడవు ఉంది.

సభ్యులకు కాంగ్రెస్ మూడు పంక్తుల విప్ జారీ

భువనేశ్వర్: రాష్ట్ర కాంగ్రెస్ గురువారం పార్టీ శాసన సభ సభ్యులకు ప్రస్తుతం జరుగుతున్న వర్షాకాల సమావేశాలకు హాజరు కావాలని 3 పంక్తుల విప్ జారీ చేసింది. గురువారం ప్రారంభమైన ఈ సమావేశాలు సెప్టెంబర్ 25 వరకు కొనసాగుతాయి. వర్షాకాలం సమావేశాలకు తన 14 మంది సభ్యులందరూ హాజరు కావాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఈ మూడు పంక్తుల విప్ జారీ చేసింది. భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన నేపథ్యంలో పార్టీ మూడు పంక్తుల విప్ జారీ ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వ వైఫల్యాలను పేర్కొంటూ 15 మంది ఎమ్మెల్యేల మద్దతుతో శాసన సభ కార్యదర్శి సత్యబ్రత రౌత్ ద్వారా స్పీకర్ సురమా పాఢీకి ఒక లేఖను సమర్పించింది.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

భువనేశ్వర్: ఖుర్దా జిల్లా బొలొగొడొ ప్రాంతంలో 33 కేవీ విద్యుత్ తీగ తగలడంతో ఒక యువకుడు మరణించాడు. మృతుడు ఖంగురియా గ్రామానికి చెందిన జగ్గు పరిడాగా గుర్తించారు. అతడు కొబ్బరి బొండాలు కోస్తుండగా లైవ్ ఎలక్ట్రిక్ వైర్‌కు తగిలి ఈ ప్రమాదం సంభవించిందని ప్రత్యక్ష సాక్షుల కథనం. సహాయక చర్యల్లో అగ్ని మాపక సిబ్బంది చర్యల పట్ల స్థానికులు అసంతృప్తి చెంది ఆందోళనకు దిగడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది.

గుణుపూర్ ఐటీడీఏ కార్యాలయం ఘెరావ్



ఐటీడీఏ అధికారులను నిలదీస్తున్న కాంట్రాక్టర్లు

రాయగడ: జిల్లాలోని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) కార్యాలయాన్ని కాంట్రాక్టర్లు గురువారం ఘెరావ్ చేశారు. ఐటీడీఏ ద్వారా కేటాయించిన అభివృద్ధి పనులు పూర్తయినప్పటికీ అందుకు సంబంధించిన బిల్లులు చెల్లించడం లేదని కాంట్రాక్టర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఐటీడీఏ జేఈని నిలదీశారు. త్వరలో బిల్లులను చెల్లించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని కాంట్రాక్టర్లు హెచ్చరించారు. వీరికి మద్దతుగా కాంగ్రెస్ నాయకులు రమాకాంత్ మాఝి, తరిణి శతపతి, భీమా జగరంగ, తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపికలు శుక్రవారం జరగనున్నాయి. శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియం వేదికగా మధ్యాహ్నం 2 గంటల నుంచి ఎంపికలు మొదలవుతాయని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కూన రవికుమార్, ప్రధాన కార్యదర్శి సూర శ్రీనివాసరావు గురువారం తెలిపారు. 2011 జనవరి ఒకటి తర్వాత జన్మించిన బాలబాలికలు అర్హులని చెప్పారు. ఎంపికైన జిల్లా జట్లను అక్టోబర్ 4 నుంచి 6 వరకు విశాఖపట్నం జిల్లా నర్సీపట్నం వేదికగా జరిగే ఏపీ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్స్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్–2025 పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు.

వన్‌స్టాప్ సెంటర్ సేవలపై ఆరా

శ్రీకాకుళం పాతబస్టాండ్/శ్రీకాకుళం: శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని మానసిక ఆరోగ్య విభాగం, వన్ స్టాప్ సెంటర్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు గురువారం సందర్శించారు. రోగులను పరామర్శించి, వారికి అందిస్తున్న వైద్య సేవ లు, పౌష్టిక ఆహార సరఫరా, ఆస్పత్రి పరిసరా ల పరిశుభ్రతపై ఆరా తీశారు. కార్యక్రమంలో డాక్టర్ డి.విజయలక్ష్మి, టి.అలేఖ్య పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని నిలదీసేందుకు..విపక్షాలు సిద్ధం



ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేస్తున్న నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: ఈసారి శాసనసభ వర్షాకాల సమావేశాలు 7 రోజుల స్వల్ప నిడివితో ముగియనున్నాయి. తొలిరోజు సంతాపానికి పరిమితం కాగా మరోరోజు విరామం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో ఈ సమావేశాలు రాజకీయంగా కీలకమైనవని విపక్షనేత నవీన్ పట్నాయక్ అభివర్ణించారు. మోహన్ చరణ్ మాఝి ప్రభుత్వ వైఫల్యాలపై దండెత్తేందుకు ఉభయ విపక్షాలు సిద్ధం అయ్యాయి. ఈ సమావేశాల్లో రెండు ప్రతిపక్ష పార్టీలు బిజూ జనతా దళ్, కాంగ్రెస్ వ్యూహాత్మకంగా ప్రభుత్వంపై దాడికి సిద్ధమయ్యాయి. ప్రధాన ప్రతిపక్ష పార్టీ బిజూ జనతా దళ్.. మహిళల భద్రత, ఎరువుల కొరత, లోపించిన శాంతిభద్రతలు ప్రధాన అంశాలుగా సభలో ప్రజల గొంతుకగా ప్రతిస్పందించాలని ఎమ్మెల్యేలకు అధినేత నవీన్ పట్నాయక్ సూచించారు. గత మూడున్నర నెలలుగా రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అసమర్థత, ఉదాసీనతతో కొనసాగుతుందని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా కుప్పకూలిపోయాయని మాజీ ముఖ్యమంత్రి ఆరోపించారు, మహిళలపై దారుణాలు ఆందోళనకరంగా పెరుగుతూ పౌరులలో అభద్రతా భావాన్ని ప్రేరేపిస్తున్నాయి. మరోవైపు మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, ఎరువుల బ్లాక్ మార్కెటింగ్, విద్యార్థి సంఘాల ఎన్నికలు, నిరుద్యోగం, శాంతిభద్రతలు వంటి ప్రధాన అంశాలతో ప్రభుత్వాన్ని సభలో నిలదీయాలని తీర్మానించింది. ఏడాదిన్నర కాలంగా పాలన సాగిస్తున్న మోహన్ చరణ్ మాఝి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు మంచి పాలన అందించడంలో విఫలమైందని పేర్కొంటూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించింది. విపక్షాల దాడిని దీటుగా ఎదుర్కొనేందుకు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధికార పక్షం సభ్యులతో గురువారం సమావేశంలో పాల్గొన్నారు.



శాసనసభ నాయకుడు రామచంద్ర కదమ్ అధ్యక్షతన సమావేశమైన కాంగ్రెసు ఎమ్మెల్యేలు

బణువగుడను విభజించాలని డిమాండ్



కుంద్ర బీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ పెద్దలు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కుంద్రా సమితి బణువగుడను విభజించాలని పంచాయతీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గురువారం గ్రామ ప్రజలు కుంద్ర బీడీఓ పి.మొనస్మితికి రాష్ట్ర పంచాయతీ రాజ్ మంత్రి రబినారాయణ నాయక్ అందిజేయాలని వినతిపత్రం సమర్పించారు. బణువగుడ పంచాయతీలో 6,500 మందికి పైగా ఓటర్లు ఉన్నారని వెల్లడించారు. అందువల్ల రెండు పంచాయతీలుగా విభజించాలని కోరారు. ఈ పంచాయతీలో ఆహార భద్రత కార్డులు గల లబ్ధిదారులు 2 వేల మందికి పైగా ఉన్నారని, వారు రేషన్ సరుకులు తెచ్చుకొనేందుకు ఎక్కువ దూరం వెళ్లాల్సి వస్తోందని వెల్లడించారు. ఇటీవల కుంద్రాలో జరిగిన జన సునానీ శిబిరంలో కుంద్రా సమితిలో పెద్దలందరూ బణువగుడ పంచాయతీని రెండుగా విభజించాలని విజ్ఞప్తి చేసిన విషయాన్ని మెమోరాండంలో గుర్తు చేశారు. కుంద్రా సమితిలో బణువగుడ పంచాయతీ రెండో పెద గ్రామ పంచాయతీ అని, ఈ పంచాయతీలో 5 రెవెన్యూ గ్రామాలతో పాటు 12 పెద్ద గ్రామాలు ఉన్నాయని వెల్లడించారు. పంచాయతీ కార్యాలయ భవనం లేక పోయినా రాజీవ్ గాంధీ సేవా గృహంలో నడుపుతున్నామన్నారు. ఈ పంచాయతీ ఆధీనంలో గల భవనాలు, గృహాలు శిథిలావస్థలో ఉన్నాయన్నారు. జాతీయ ఆహార సురక్షా పథకంలో లబ్ధిదారుల కుటుంబాల జన సంఖ్య 11,000 అని, అందుచేత ఎన్నికలకు ముందుగా ఈ పంచాయతీని విభజించాలని విజ్ఞప్తి చేశారు. బీడీఓకు మెమోరాండం సమర్పించిన వారిలో గ్రామ పెద్దలు మనూ సాబత్, శ్యామ సుందర మాలి, గ్రామ పంచాయతీ సర్పంచ్ దుతికా భూమియ, సమితి సభ్యులు వణిత ఖెందులియ, శౌశానంద బిశాయి, తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన అవసరం

శ్రీకాకుళం పాతబస్టాండ్: యువత, మహిళా సంఘాలకు ప్రధాన మంత్రి రైతు నిధి, ఆయుష్మాన్ భారత్, నైపుణ్య భారతం వంటి ప్రధాన పథకాలపై అవగాహన అవసరమని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు సంచాలకుడు పి.కిరణ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మేరా యువ భారత్ ఉప సంచాలకుడు కె.వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ ఆరోగ్య భారత్–ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన, ప్రధాన మంత్రి రుణ పథకం, డిజిటల్ భారత్ కార్యక్రమాలు, నైపుణ్య భారతం, స్వచ్ఛ భారత్, ప్రతి ఇంటికీ నీరు పథకం, విశ్వకర్మ యోజన, స్టాండ్ అప్ ఇండియా, ఉజ్వల యోజన, బిడ్డను చదివించు–బిడ్డను కాపాడు వంటి పథకాలను వివరించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ ప్రధాన అధికారి జి.ఎం.శ్రీధర్, నాబార్డ్ సహాయ ప్రధాన అధికారి కె.రమేష్‌కృష్ణ, లీడ్ బ్యాంకు అధికారి పి.శ్రీనివాసరావు, రాష్ట్ర సూక్ష్మ నీటిపారుదల ప్రాజెక్టు సంచాలకుడు ఆర్.శ్రీనివాసరావు, సెట్‌శ్రీ ప్రధాన కార్యనిర్వాహక అధికారి వి.వి.అప్పలనాయుడు, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్, స్వీప్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు కొమ్ము రమణమూర్తి, స్పందన సంస్థ అధ్యక్షుడు పొన్నాడ కష్టారావు, యువజన సంఘాలు, మహిళా సంఘాల ప్రతినిధులు, మేర యువ భారత్ వాలంటీర్లు పాల్గొన్నారు.

సెంచూరియన్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు ప్రశంస



బృందావన్ ప్యాలస్‌లో మొక్కలను నాటిన సెంచూరియన్ వర్సిటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు



మంత్రి నిత్యానంద గోండ్‌తో సెంచూరియన్ వర్సిటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

పర్లాకిమిడి: స్థానిక బృందావన్ ప్యాలస్‌లో సెంచూరియన్ వర్సిటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఏక్ పేడ్ మాకే నాం 2ఓ ప్రత్యేక ప్లాంటేషన్ కార్యక్రమంలో 126 మంది పాల్గొని దాదాపు 200మొక్కలను నాటారు. రాష్ట్ర గణశిక్ష, ఎస్సీ, ఎస్టీ డెవలప్‌మెంట్ మంత్రి నిత్యానంద్ గోండ్ విద్యార్థులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సెంచూరియన్ వర్సిటీ ఎన్ఎస్ఎస్ అధికారితో రాజేష్ పాత్రో, డీఎఫ్ఓ కె.నాగరాజు, ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, తదతరులు పాల్గొన్నారు.

పరిశోధనలతోనే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న మేరా యువ భారత్ డీడీ కె.వెంకట్ ఉజ్వల్

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రస్తుత పోటీ ప్రపంచంలో పరిశోధనలవైపు విద్యార్థులు దృష్టి సారిస్తే అద్భుతంగా రాణించగలుగుతారని మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్ పేర్కొన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు అధ్యక్షతన కళాశాల సిల్వర్ జూబ్లీ ఆడిటోరియం వేదికగా సమాజంలో సైన్స్ వైబ్రేషన్స్ పేరిట జరిగిన రెండు రోజుల సైన్స్ ప్రయోగాల ప్రదర్శన గురువారంతో ముగిసింది. కళాశాల సెంటర్ ఫర్ అప్లయిడ్ సైన్సెస్, జంతుశాస్త్ర విభాగాలు సంయుక్తంగా.. ఇండిజీనియస్ సొసైటీ ఫర్ ఫ్రోగల్ సైన్స్ ఇన్వెన్షన్ సొసైటీ సౌజన్యంతో ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు శ్రీకాకుళం మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు, జన విజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ గొంటి గిరిధర్, వివిధ కళాశాలల అధ్యాపకులు ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. ఇలాంటి ఎగ్జిబిషన్‌తో శాస్త్రీయ దక్పథం పెంపొందించవచ్చన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతిఒక్కరికి నిర్వహనకర్త డాక్టర్ మదమంచి ప్రదీప్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.పోలినాయుడు, ప్రొగ్రాం కోఆర్డినేటర్స్ డాక్టర్ రోణంకి హరిత, పి.సుధారాణి, శివాల రవిబాబు, కె.అపర్ణ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రానైట్ క్వారీతో ప్రశాంతత దూరం చేయెద్దు



తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

మెళియాపుట్టి: గ్రానైట్ క్వారీ వల్ల గ్రామం మట్టి దిబ్బలా మారిపోతుందని, ఇప్పటికే చుట్టుపక్కల గ్రామాల ప్రజల ఇబ్బందులు చూస్తున్నామని, తమ గ్రామ పరిధిలో గ్రానైట్ క్వారీ ఏర్పాటు చేసి ప్రశాంతత లేకుండా చేయవద్దని మెళియాపుట్టి మండలం సుర్జిని గ్రామస్తులు తేల్చిచెప్పారు. ఈ మేరకు దుర్గమ్మ కొండ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్వారీలో తవ్వకాలు, రాళ్ల రవాణా వల్ల గ్రామం దుమ్ముధూళితో నిండిపోవడమే కాకుండా రాళ్లు ఇళ్లపై పడి ప్రమాదాలు జరగే అవకాశం ఉందన్నారు. ప్రశాంతంగా జీవిస్తున్న తాము నిద్రలేని రాత్రుళ్లు గడపాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్దార్ పాపారావుకు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. తమకు సమాచారం ఇవ్వకుండా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారని చెప్పారు. శక్తి మూగాంబికా క్వారీ యాజమాన్యం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ బయటి గ్రామాల ప్రజలను తీసుకొచ్చి అభిప్రాయ సేకరణ ముగించారని పేర్కొన్నారు. ప్రథమపౌరుడు గ్రామ సర్పంచ్ పెద్దింటి చంద్రరావుకు కూడా సమాచారం ఇవ్వలేదన్నారు. నిరసన కార్యక్రమంలో కొర్ల కృష్ణమూర్తి, ఇప్పిలి రామారావు, ఢిల్లేశ్వరరావు, జన్ని రామారావు, కొర్ల వేణు, కొర్ల లోకేశ్వరరావు, పైల కూర్మనాయకులు, కింతలి కిరణ్, రాంబాబు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

డైలీ మార్కెట్‌కు స్థలం కేటాయింపు



ఆర్‌కేనగర్‌లో ఏర్పాటు చేసిన కూరగాయల వ్యాపారాలకు స్థలం



కస్తూరీనగర్‌లో గల బిజుపట్నాయక్ మార్కెట్ కాంప్లెక్స్

రాయగడ: స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి కపిలాస్ కూడలి వరకు గల ఫ్లై ఓవర్ బ్రిడ్జి మరమ్మతుల చర్యల్లో భాగంగా బ్రిడ్జి కింద గత కొన్నాళ్లుగా కూరగాయలు, తదితర చిరువ్యాపారాలు చేసుకుంటున్న వారిని మున్సిపాలిటీ యంత్రాంగం ఖాళీ చేయాల్సిందిగా నోటీసులు జారీ చేసింది. అయితే ఏళ్ల తరబడి ఇక్కడ వ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న తామంతా తమ దుకాణాలను ఖాళీ చేస్తే ఉపాధి అవకాశాలు కోల్పోతామని వ్యాపారస్తులు మున్సిపాలిటీ యంత్రాంగం దృష్టికి తీసుకువెళ్లడంతో యంత్రాంగం స్పందించింది. దీంతో వ్యాపారాల కోసం స్థలాన్ని కేటాయించింది. పాత టౌన్ (రాయగడ) ప్రజల సౌకర్యార్థం స్థానిక రామకృష్ణనగర్ నుంచి కేంద్రీయ విద్యాలయానికి అనుసంధానించే స్థలంలో కూరగాయలు, చిరు వ్యాపారస్తులు తమ వ్యాపారాలు కొనసాగించుకోవాలని స్థలాన్ని కేటాయించారు. అదేవిధంగా కొత్త టౌన్ (రాయగడ) ప్రజల సౌకర్యార్థం కస్తూరీ నగర్‌లో ఇదివరకు గల డైలీ మార్కెట్ కాంప్లెక్స్‌లో వ్యాపారాలు కొనసాగించుకోవాలని కేటాయించింది. అలాగే స్థానిక రెగ్యులేటెడ్ మార్కెటింగ్ కమిటీ (ఆర్ఎంసీ) యార్డ్ వద్ద కూడా కూరగాయాల వ్యాపారులు తమ లావాదేవీలను కొనసాగించుకోవాలని స్థలాన్ని కేటాయిస్తూ అనుమతులను జారీ చేసింది.

• ఏక్ పేడ్ మా కే నామ్



శాసన సభ ప్రాంగణంలో ఏక్ పేడ్ మా కే నామ్ రెండో విడత కార్యక్రమం ప్రారంభించిన స్పీకరు సురమా పాఢి



శాసన సభ ఆవరణలో మొక్క నాటిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభ ప్రాంగణంలో సభ్యులు మొక్కలు నాటారు. ఏక్ పేడ్ మా కే నామ్ రెండో విడత కార్యక్రమం కింద గురువారం ఈ కార్యక్రమం చేపట్టారు. శాసన సభ స్పీకర్ సురమా పాఢి ఆహ్వానం మేరక ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఇతర మంత్రులు, డిప్యూటి స్పీకర్, ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

సంస్కృతం సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం



మాట్లాడుతున్న వీసీ కె.ఆర్.రజనీ

ఎచ్చెర్ల : పీఎం ఉష నిధులు సహకారంతో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వ విద్యాలయం తెలుగు విభాగంలో సంస్కృతంలో సర్టిఫికెట్ కోర్సును గురువారం వైస్ చాన్సలర్ కె.ఆర్.రజనీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంస్కృతం నుంచే హిందీ తదితర భాషలన్నీ ఉద్భవించాయని చెప్పారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ బి.అడ్డయ్య మాట్లాడుతూ సంస్కృతం నేర్చుకుని విద్యార్థులు మంచి భవిష్యత్తులో స్థిరపడాలని అన్నా రు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ, ప్రోగ్రామ్ సమన్వయకర్త డాక్టర్ టి.సంతోషి, పావని, తెలుగు భాషా విభాగం సమన్వయకర్త డాక్టర్ పి.లక్ష్మణరావు, ఎన్.లోకేశ్వరి, కె.ఉదయ్‌కిరణ్, బలరాం నాయుడు, ఎం.ప్రకాష్ రావు, పి.రవికుమార్ పాల్గొన్నారు.

మా జీవితాలు ఇంతేనా?

- సమగ్ర శిక్ష, విద్యాశాఖలో చాలీచాలని వేతనాలు
- ఇబ్బందుల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు
- కనికరించని కూటమి పాలకులు



హిరమండలంలో పాఠాలు భోదిస్తున్న సీఆర్ఎంటీ శ్రీదేవి

హిరమండలం:

సమగ్రశిక్ష, విద్యాశాఖలో చిరుద్యోగులైన సీఆర్ఎంటీ (క్లస్టర్ రిజర్వు మొబైల్ టీచర్స్), మండల లెవల్ అకౌంటెంట్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు చాలీచాలని వేతనాలతో కుటుంబాలను భారంగా నెట్టుకొస్తున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర సరుకులు, ఇంటి అద్దెలు, ఖర్చులతో దిక్కుతోచని పరిస్థితిలో అల్లాడిపోతున్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా జీతాలు పెరగడం లేదని, ఉద్యోగ భద్రత లేకుండా ఉండటం లేదని ఆందోళన చెందుతున్నారు. సమాన పనికి సమాన వేతనం కల్పించాలన్న సుప్రీంకోర్టు తీర్పును పాలకులు అమలు చేయకపోవడం తగదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లా వ్యాప్తంగా మండల వనరుల కేంద్రాలలో 224 మంది సీఆర్ఎంటీలు, 15 మంది మండల లెవల్ అకౌంటెంట్లు, 30 మంది ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, 30 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు, 30 మంది మెసెంజర్లు పనిచేస్తున్నారు. వీరంతా 2012లో ఉద్యోగాల్లో చేరారు. అప్పట్లో వీరికి నెలకు రూ. 18500 జీతం అందేది. తర్వాత వచ్చిన పాలకులు జీతాలు విస్మరించగా 2020లో వైఎస్సార్ సీపీ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు రూ.23,500కు వేతనం పెంచారు.

కక్ష కట్టిన కూటమి..

కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరునెలల్లోనే కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో నడుస్తున్న పథకాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు, స్థానిక సంస్థలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమమ్ టైం స్కేల్ వర్తింప చేయరాదని 2025 జనవరిలో జీవో నంబర్ –2 విడుదల చేసింది. ప్రభుత్వ శాఖలలో మంజూరైన ఖాళీ పోస్టులలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు మాత్రమే అర్హులని తేల్చింది. ఈ జీవో రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కుకు విరుద్ధమని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సరైన వేతన నిబంధనలు అమలు కావడం లేదని వాపోతున్నారు.



హిరమండలం ఎమ్మార్సీ భవనంలో విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష సిబ్బంది

అమలుకాని హామీలు..

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చినా అమలు చేయడం లేదు. ఇటీవల ఎన్టీఆర్ భరోసా పెన్షన్, నూతన రేషన్ కార్డులు, తల్లికి వందనం వంటి పథకాలు అమలు చేసినప్పటికీ చిరుద్యోగులకు వర్తింపచేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యావసర ధరలు, రవాణా ఖర్చులు, వైద్యఖర్చులు, ఇంటి అద్దె విపరీతంగా పెరగడంతో జీతాలు సరిపోవడం లేదని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వాపోతున్నారు. నెలవారీ ఖర్చుల కోసం అప్పులు చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీతం పెంపుతో పాటు రిటైర్‌మెంట్ వయసు పెంపు, ఆరోగ్య భద్రత, పిల్లల విద్య, ఇంటి అద్దె భృతి, రేషన్ సబ్సిడీ పథకాలు, పదవీ విరమణ ప్రయోజనాలు వంటివి ప్రత్యేకంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

వేతనాలు పెంచాలి



జీతాలు పెరగక ఇబ్బందులు పడుతున్నాం. నిత్యావసర ధరలు, రవాణా, వైద్యం, ఇంటి అద్దె వంటి ఖర్చులు విపరీతంగా పెరగడంతో కుటుంబ పోషణ భారమవుతోంది. నెలవారీ ఖర్చుల కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి జీతాలు పెంచాలి.

– కె.చంద్రరావు, సీఆర్ఎంటీ, అవలంగి క్లస్టర్, హిరమండలం

ఉద్యోగ భద్రత కల్పించాలి



కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి. చాలీచాలనీ జీతాలతో ఇబ్బందులు పడుతున్నాం. ఉపాధ్యాయుల మాదిరిగానే సెలవులు వర్తింపచేయాలి. ఉద్యోగ విరమణ 62 ఏళ్లకు పెంచి రిటైర్మెంట్ ప్రయోజనాలు కల్పించాలి.

– పోలాకి తవిటినాయుడు, సీఆర్ఎంటీ జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

ప్రగతి లక్ష్య సాధనకు కృషి చేయాలి

● కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర్ రెడ్డి ఆదేశాలు

పార్వతీపురం రూరల్: ప్రభుత్వ శాఖల్లో నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా జిల్లా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. లక్ష్య సాధనలో నిర్లక్ష్యం పనికిరాదని సూచించిన గడువుకు ముందే ప్రగతిని సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వ్యవసాయ అనుబంధ రంగాలు, ఆర్‌అండ్‌బీ, ఐసీడీఎస్, విద్య, విద్యుత్, మున్సిపాల్టీ తదితర శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ ఉద్యానవన రంగాల్లో బహుళ పంటల దిశగా ఆలోచన చేయాలని తద్వారా రైతులు అధిక ఆదాయం పొందుతారన్నారు. అలాగే జిల్లాలో ఈ-పంట నమోదు శతశాతం జరగాలని చెప్పారు.

రైతు సేవా కేంద్రాల వారీగా వర్క్‌షాపులు

రైతు సేవా కేంద్రాల వారీగా వర్క్‌షాపులు ఏర్పాటు చేసి ప్రతి రైతుకు డ్రోన్స్ వాడకంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. అలాగే అటవీ సంపద పెరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, జిల్లాలో పశుసంపద మరింత వృద్ధి ఉండాలని కలెక్టర్ చెప్పారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, పట్టు, పశుసంవర్ధకశాఖల అధికారులు కె.రాబర్ట్‌పాల్, టి.సంతోష్‌కుమార్, ఏపీ సాల్మన్‌రాజు, డా.ఎస్. మన్మథరావు, డీఆర్‌డీఏ, ఐసీడీఏఎస్ పీడీలు సుధారాణి, కనకదుర్గ, మరికొంతమంది అధికారులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని రెండు ఎద్దుల మృతి



ప్రమాదంలో మృతి చెందిన ఎద్దులు

సీతానగరం: మండలంలోని జాతీయ రహదారిపై గురువారం లారీ ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో రెండు ఎద్దులు మృతి చెందగా రైతుకు స్వల్ప గాయాలయ్యాయి. దీనిపై స్థానిక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తెల్లవారుజామున సుమారు 5.30 గంటల జగ్గునాయుడుపేట గ్రామం నుంచి ఇసుక తీసుకుని వెళ్లడానికి సీతానగరానికి రెండు నాటు బళ్లు వస్తుండగా అదే సమయంలో పార్వతీపురం నుంచి బొబ్బిలి వెళ్తున్న లారీని డ్రైవర్ అజాగ్రత్తగా నడపడం వల్ల ఎదురుగా రెండు నాటుబళ్లను లారీ ఢీకొట్టింది. దీంతో ముందు నాటు బండి తోలుతున్న రెడ్డి తిరుపతిరావుకు చెందిన ఒక ఎద్దు, రెండవ నాటు బండి తోలుతున్న పెంట పోలీనాయుడుకు చెందిన ఒక ఎద్దు సంఘటనా స్థలంలోనే మృతి చెందాయి. ముందు నాటుబండి తోలుతున్న రెడ్డి తిరుపతిరావుకు స్వల్ప గాయాలు కావడంతో పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. క్షతగాత్రుడు తిరుపతిరావు ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణం తీసిన పరుగు

● ఆగిపోయిన ఇంజినీరింగ్ విద్యార్థి గుండె



సాయికిరణ్(ఫైల్)

విజయనగరం క్రైమ్: పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం ఉద్దవోలుకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి సాయికిరణ్ పరుగు పెడుతుండగా అకస్మాత్తుగా గుండె ఆగిపోయి మృతిచెందాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ రెండవ సంవత్సరం చదువుతున్న సాయికిరణ్ ఎన్‌సీసీపై ఇష్టంతో కాలేజీలో గురువారం జరిగిన ఎంపికల్లో పాల్గొన్నాడు. ఈ ఎంపికలో భాగంగా 1.6 కిలోమీటర్ల పరుగులో సాయికిరణ్ పరుగెత్తి ఒక్కసారిగా కింద పడిపోయాడు. వెంటనే కళాశాల యాజమాన్యం, ఎన్‌సీసీ సిబ్బంది, విద్యార్థి వివరాలు కనుక్కుని..పేరెంట్సను సంప్రదించి హుటాహుటిన ప్రభుత్వం హాస్పిటల్‌కు తీసుకువెళ్లడంతో వైద్యులు చికిత్స చేస్తుండగా సాయికిరణ్ మృతి చెందాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన సాయికుమార్ తండ్రి పోలినాయుడు ఎన్నో ఆశలతో తన కొడుకును ఇంజినీరింగ్ చదివించి ఉన్నతస్థానంలో చూడాలనుకున్న ఆయన ఆశలు ఆవిరయ్యాయి. మృతుడికి తల్లి సుజాత, తండ్రి పోలినాయుడు, వివాహమైన, సోదరి శ్రావణి ఉన్నారు.

సిరిమాను చెట్టును దర్శించుకున్న అటవీశాఖ అధికారులు



సిరిమాను చెట్టుకు పూజలు చేస్తున్న అటవీశాఖ అధికారులు

విజయనగరం గంటస్తంభం: గంట్యాడ మండలం కొండతామరాపల్లి గ్రామంలోని పైడితల్లి అమ్మవారి సిరిమాను చెట్టును జిల్లా అటవీశాఖ అధికారి ఆర్.కొండలరావు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రామ్‌నరేష్ గురువారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు జరిపారు. పైడితల్లి జాతరను కొన్నేళ్లుగా రాష్ట్ర పండగగా ప్రభు త్వం నిర్వహిస్తోందని, అమ్మవారి దీవెనలు జిల్లా వాసులందరిపైనా ఉండాలని ఆకాంక్షించారు.

పండగ శోభ ప్రతిబింబించాలి

● సాధారణ భక్తులకు ఇబ్బంది లేకుండా వీఐపీ దర్శనాలు
● పైడితల్లి అమ్మవారి పండగ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష





సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల జిల్లా అధికారులు, (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి

విజయనగరం అర్బన్: పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు ప్రతి ఒక్కరి మదిలో పవిత్రంగా నిలిచిపోయేలా నిర్వహించాలని, పండగ శోభ ప్రతిబింబించాలని కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి తెలిపారు. ప్రతి దశలోనూ అధికారుల మధ్య సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ మేరకు పండగ ఏర్పాట్లపై కలెక్టర్ గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని శాఖల వారికి కేటాయించిన విధులను నిబద్ధతతో నిర్వర్తించాలని, సిరిమాను పవిత్రతను కాపాడుతూ భక్తుల మనోభావాలకు అనుగుణంగా పండగ నిర్వహించాలన్నారు. వీఐపీ దర్శనాల వల్ల సాధారణ భక్తుల దర్శనాలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని చెప్పారు. సిరిమాను తిరిగే ప్రదేశంలో ఎక్కడా రోడ్డుపై గుంతలు లేకుండా చూడాలని, అలాగే పారిశుధ్యం, రక్షిత తాగునీటి సరఫరా, బయో టాయిలెట్స్ ఏర్పాటు, నగరమంతా సుందరీకరణ, విద్యుత్ అలంకరణ తదితర పనులను మున్సిపల్ శాఖ నిర్వహించాలని సూచించారు. పండగలో ప్లాస్టిక్‌ను వినియోగించకుండా చూడాలని, క్యూల వద్ద ఏర్పాటు చేసిన తాగునీరు పేపర్ గ్లాసుల ద్వారా అందించాలని వాటిని జాగ్రత్తగా వెంటనే తొలగించాలని తెలిపారు. ప్రసాదాలను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ చేయాలని అలాగే అన్ని ఆర్ ఓప్లాంట్లను ఆర్‌డీఓ ఆధ్వర్యంలో తనిఖీ చేయాలని సూచించారు.

శాంతిభద్రతల లోపం ఉండరాదు

వైద్య ఆరోగ్య శాఖ ద్వారా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి, అత్యవసర చికిత్సకు అవసరమైన మందులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రధానంగా 6, 7 తేదీల్లో తొలేళ్లు, సిరిమాను ఉత్సవం సందర్భంగా ఎక్కువ మంది భక్తులు వస్తారని శాంతి భద్రతల లోపం లేకుండా చూడాలని పోలీస్ శాఖకు సూచించారు.

వాహనాల పార్కింగ్‌కు తగు ఏర్పాట్లను చేయాలని, పోలీస్, ఫైర్ శాఖల అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. బారికేడింగ్ ఎత్తు పెంచాలని లేదంటే పైనుంచి దూకి వస్తున్నారని పోలీస్ వారు చేసిన విజ్ఞప్తి మేరకు కలెక్టర్ 4 అడుగుల నుంచి 5 అడుగులకు పెంచాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. తెప్పోత్సవంలో గజ ఈతగాళ్లు ఉండాలని, మత్స్యవారికీ, తెప్పలను తనిఖీ చేసి సర్టిఫికెట్ ఇవ్వాలని ఆర్‌అండ్‌బీ శాఖకు సూచించారు.

నగరమంతా సుందరీకరించాలి

సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ అక్టోబర్ 1 నుంచి 7 వరకు నగరమంతా సుందరీకరణ చేయాలని ఎంఎస్ఎంఈ మంత్రి సూచించారని, ఆయన ఆదేశాల మేరకు సోషల్ మీడియా, సుందరీకరణ, ఎల్.ఈ.డీ స్క్రీన్ల ఏర్పాటు చేయాలని సమాచార శాఖ అధికారులకు ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ సౌమ్యలత, డీఆర్ఓ శ్రీనివాసమూర్తి, ఆర్‌డీఓ దాట్ల కీర్తి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష, పూజారి బంటుపల్లి వెంకటరావు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో ఆకలికేకలు



గంట్యాడ మండలంలో పనిచేస్తున్న వేతనదారులు (ఫైల్)

● వేతనాలు అందక వేతనదారుల అవస్థలు
● చెల్లించాల్సిన వేతనాల బకాయి రూ.72 కోట్లు

విజయనగరంఫోర్ట్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే వేతనదారులకు గత కొంతకాలంగా వేతనాలు అందడం లేదు. దీని వల్ల వేతనాల మీదే అధారపడే వారంతా ఇబ్బంది పడుతున్నారు. లక్షలాది మంది వేతనదారులకు కోట్లాది రుపాయల వేతనాలు రావాల్సి ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో వేతనదారులకు వేతనాలు సకాలంలో వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేవి. కానీ కూటమి ప్రభుత్వం హయాంలో పనిచేసి నెలలైనా వేతనాలు జమకావడం లేదు.

కూటమి సర్కార్‌లో వేతనదారులకు అవస్థలే

కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన నాటినుంచి ఉపాధిహామీ పథకంలో పనిచేసే వేతనదారులకు తిప్పలు తప్పడం లేదు. కుటుంబ పోషణ కోసం పనులకు వెళ్లే వేతనదారులకు వేతనాలు ఇవ్వకుండా కూటమి సర్కార్ అలసత్వం వహిస్తోంది. వలసల నివారణ కోసం ప్రవేశపెట్టిన ఉపాధిహామీ పథకం వేతనాలు సకాలంలో చెల్లించక పోవడం వల్ల ఉపాధి పనులకు వెళ్లడానికి రైతులు అసక్తి చూపడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

1.05 కోట్ల పనిదినాల కల్పన

2025-26 సంవత్సరానికి సంబంధించి 1.25 కోట్ల పనిదినాలు కల్పించాల్సి ఉండగా ఇప్పటి వరకు 1.05 లక్షల పనిదినాలు కల్పించారు. అయితే దీనికిగాను రూ.297 కోట్లు వేతనాలకు సంబంధించి నిధులు చెల్లించాల్సి ఉండగా ఇంతవరకు రూ. 225 కోట్లు మాత్రమే చెల్లించారు. ఇంకా రూ. 72 కోట్లు చెల్లించాల్సి ఉంది.

3.45 లక్షల జాబ్ కార్డులు

జిల్లాలో 3.45 లక్షల జాబ్ కార్డులు ఉండగా వాటి పరిధిలో 6.05 లక్షల మంది వేతనదారులు ఉన్నారు. వారిలో నాలుగు లక్షల నుంచి ఐదు లక్షల వరకు వేతనదారులు పనికి వెళ్తుంటారు.

బిల్లులు చెల్లించాల్సి ఉంది

జిల్లాలో ఉపాధి వేతనదారులకు ఇంతవరకు రూ.225 కోట్లు బిల్లులు చెల్లించాం. ఇంకా రూ.72 కోట్లు చెల్లించాల్సి ఉంది.
ఎస్.శారదాదేవి, పీడీ, డ్వామా

రాములోరికి 'పవిత్రాల సమర్పణ'

● మంగళవాయిద్యాలతో వైభవంగా పట్టు పవిత్రాల ఊరేగింపు
● అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తజనం
● నేడు స్వామివారికి పట్టాభిషేక మహోత్సవం



పవిత్రాల అలంకరణలో శ్రీ రామచంద్ర స్వామి



స్వామివారి పట్టు పవిత్రాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో స్వామివారికి పట్టు పవిత్రాల సమర్పణ కార్యక్రమం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. వేకువజామున ప్రాతఃకాలార్చన పూజలనంతరం మంగళాశాసనం, తీర్థ గోష్ఠి కార్యక్రమాలను జరిపించారు. పారాయణాలు, జపాలు, హవనాలు నిర్వహించి అష్ట కలశ స్నపన మహోత్సవాన్ని జరిపించారు. అనంతరం దేవస్థానం అర్చకులు, వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన వేద ఋత్విక్కుల ఆధ్వర్యంలో పట్టు పవిత్రాలను మంగళవాయిద్యాల నడుమ దేవస్థానం వెలుపల ఊరేగించి సీతారామస్వామికి సమర్పించారు. పవిత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం పవిత్ర విసర్జన, పూర్ణాహుతి, శాంతి కల్యాణంతో పాటు పట్టాభిషేక మహోత్సవాన్ని జరిపించనున్నామని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసరావు, అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్, వరప్రసాద్, రామగోపాల్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో డిగ్రీ విద్యార్థినుల ప్రతిభ



విశాఖలో జరిగిన కబడ్డీ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచిన చీపురుపల్లి బాలికల జట్టు

చీపురుపల్లి: జోనల్‌స్థాయి బాలికల కబడ్డీ పోటీల్లో స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల బాలికలు ఉత్తమ ప్రతిభ కనపరిచారు. విశాఖపట్నంలోని మహిళా డిగ్రీ కళాశాల 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అక్కడ జోనల్ స్థాయి బాలికల కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న చీపురుపల్లి ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల బాలికల జట్టు తృతీయస్థానంలో నిలిచింది. దీంతో కళాశాల ప్రిన్సిపాల్ డా.పీవీజీ.కృష్ణాజీ, వైస్ ప్రిన్సిపాల్ ఎం.రమేష్ కుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కె.జ్వాలాముఖి, పీఈటీ పి.రామలక్ష్మి తదితరులు విద్యార్థినులను అభినందించారు.

కుక్కలు కరిచి ఆరుగురికి గాయాలు

మెంటాడ: మండల కేంద్రంలో గురువారం ఆరుగురిని కుక్కలు కరవడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ మేరకు గాయాలపాలైన వారిని కుటుంబ సభ్యులు వైద్యసేవల కోసం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితులకు ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం తీవ్రగాయాలైన కె.అప్పలనాయుడు, పి.శంకరరావులను గజపతినగరం ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు డాక్టర్ లోకప్రియ తెలిపారు.

దుండగుల దుశ్చర్య



పోలీస్‌స్టేషన్ సమీపంలో దుండుగులు చించివేసిన ఫ్లెక్సీ

నెల్లిమర్ల: మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పుట్టినరోజు సందర్భంగా స్థానిక నగరపంచాయతీలో వైఎస్సార్ సీపీ నాయకులు, ఆయన అభిమానులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పలుచోట్ల ఏర్పాటు చేసిన ఆయన బర్త్‌డే ఫ్లెక్సీలను గుర్తు తెలియని దుండగులు చించివేశారు. స్టేట్‌బ్యాంకు, రామతీర్థం జంక్షన్‌ల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను పూర్తిగా తొలగించగా, పోలీస్‌స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన మరో ఫ్లెక్సీని చించివేశారు. దీనిపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు, స్థానికులు మండిపడుతున్నారు. ఇదేం పని? ఇది మంచి పద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి చర్యలను రాజకీయ నాయకులెవరూ ప్రోత్సహించకూడదని హితవు పలుకుతున్నారు.

జూట్ మిల్లు భూముల కోసం కూటమి నాయకుల కుట్ర

● భూములు డొంకినవలస రైతులకే చెందాలి
● మాజీ ఎమ్మెల్యే శంబంగి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు తదితరులు

బొబ్బిలి: భూములిచ్చిన ప్రతి రైతుకు జూట్‌మిల్లులో ఉద్యోగం ఇస్తామని, బాడంగి మండలం డొంకినవలస ఎత్తు కానా వద్ద 80వ దశకంలో రైతుల వద్ద సేకరించిన సుమారు 32 ఎకరాల భూములు ఆ ఫ్యాక్టరీ నిర్మించనందున తిరిగి రైతులకే చెందాలని మాజీఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాడంగి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. మహావీర్ కంపెనీ ప్రతినిధులు సేకరించిన భూములకు సంబంధించి డమ్మీ నాయకులు తయారై మ్యుటేషన్‌కు సిద్ధమవుతున్నారని, దీనిని ఖండిస్తున్నానన్నారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌తో మ్యుటేషన్‌కు ప్రయత్నాలు

గతంలో ఇక్కడున్న తహసీలోద్దర్ సుధాకర్ అటువంటి పనులకు ఒప్పుకోరని ట్రాన్స్‌ఫర్ చేయించి ఆయన స్థానంలో పక్క మండలంలో పనిచేస్తున్న ఓ డీటీకి ఎఫ్ఏసీ ఇచ్చి నియమించుకున్నారని, ఇప్పుడా ఇన్‌చార్జి తహసీల్దార్‌తో మ్యుటేషన్‌కు ఆమోదం చెప్పేందుకు కూటమి నాయకులు కొత్త ఎత్తుగడ వేశారని ఆరోపించారు. ఆ భూములు ఎలాగైనా హస్తగతం చేసుకునేందుకు మండల స్థాయి నుంచి కలెక్టర్ వరకూ నగదు కూడా చేతులు మారినట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయమై తాను రెండు రోజుల క్రితం ఆర్డీఓ రామమోహనరావు, కొత్తగా వచ్చిన తహసీల్దార్‌కు ఫోన్ చేసి ఆ భూములు అక్కడ ఉన్న రైతులకు చెందాలని చెప్పానన్నారు. కూటమి నాయకులు, ఇతర వ్యక్తులు ఆ భూములను హస్తగతం చేసుకుంటామంటే ఒప్పుకునేది లేదని స్పష్టం చేశారు. దీనిపై ఎందాకైనా వెళ్లనున్నట్లు స్పష్టం చేశారు. సమావేశంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బేతనపల్లి శంకరరావు, కార్యదర్శి తెర్లి శ్రీనివాసరావు, గూడెపువలస రాజు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

కన్నకొడుకే..కాలయముడు

● మద్యం మత్తులో తండ్రిని రాయితో కొట్టిన కుమారుడు
● ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన తండ్రి



చిన్నకుమారుడు రాయితో కొట్టడంతో తీవ్రంగా గాయపడిన అప్పలస్వామి



ఎం.ఆర్ అగ్రహారంలో దర్యాప్తు చేస్తున్న బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు, క్లూస్ టీం



అప్పలస్వామి(ఫైల్)

తెర్లాం: కనిపెంచిన కుమారుడే కన్న తండ్రి పట్ల కాలయముడయ్యాడు. మద్యం తాగిన మైకంలో కుమారుడు రాయితో కొట్టడంతో తండ్రి తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చెందిన సంఘటన తెర్లాం మండలం ఎం.ఆర్ అగ్రహారం గ్రామంలో సంచలనం రేపింది. ఈ ఘటనకు సంబంధించి బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు గురువారం తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఎంఆర్ అగ్రహారం గ్రామానికి చెందిన నగరపు అప్పలస్వామి(85)కి ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిద్దరికి తన భూమిని పంచిపెట్టి, తన పోషణ నిమిత్తం ఒక ఎకరా భూమిని అప్పలస్వామి ఉంచుకున్నాడు. వృద్ధాప్యంలో ఉన్న అప్పలస్వామిని పెద్దకుమారుడు తన వద్ద ఉంచుకుని తండ్రిని పోషిస్తున్నాడు. తన వద్ద ఉన్న ఎకరా భూమి సాగు చేసుకునేందుకు పెద్ద కుమారుడికి తండ్రి ఇచ్చాడు. తండ్రి వద్ద ఉన్న భూమి తనకు సాగు చేసుకునేందుకు ఇవ్వాలని చిన్న కుమారుడు శంకరరావు అడగ్గా తండ్రీకొడుకుల మాటామాట పెరిగి గొడవకు దారితీసింది. దీంతో శంకరరావు రాయి తీసుకుని తండ్రి తలపై బలంగా కొట్టగా తీవ్రంగా గాయపడిన అప్పలస్వామిని తెర్లాంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి నిమిత్తం మనుమరాలు నగరపు కల్పన, ఇతర కుటుంబసభ్యులు తీసుకువచ్చారు. ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం తలకు స్కానింగ్ చేయించి తీసుకురమ్మని వైద్యులు చెప్పడంతో స్కానింగ్ తీయించి తీసుకువచ్చారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం అప్పలస్వామి మృతి చెందాడు.

పరిశీలించిన సీఐ

ఈ సంఘటనకు సంబంధించి అందిన సమాచారంతో ఎస్సై సాగర్‌బాబు, బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు క్లూస్ టీమ్‌తో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి వివరాలు సేకరించారు. అప్పలస్వామి మృతదేహానికి కుటుంబసభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. మృతుడి మనుమరాలు కల్పన ఇచ్చిన ఫిర్యాదు మేరకు తెర్లాం ఎస్సై సాగర్‌బాబు హత్య కేసు నమోదు చేయగా, బొబ్బిలి రూరల్ సీఐ దర్యాప్తు చేస్తున్నారు.

యూరియా కోసం అవస్థలు



వల్లూరు రైతుసేవా కేంద్రానికి పోటెత్తిన రైతులు



చంద్రంపేట రైతుసేవా కేంద్రం వద్ద అన్నదాతల పడిగాపులు

నెల్లిమర్ల రూరల్: యూరియా కోసం రైతులు నానాఅవస్థలు పడుతున్నారు. మండలంలోని వల్లూరు, చంద్రంపేట రైతు సేవా కేంద్రాల వద్ద గురువారం అందిస్తామని అధికారులు సమాచారం ఇవ్వడంతో వేకువజాము నుంచే ఆయా కేంద్రాల వద్దకు రైతులు పోటెత్తారు. గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడ్డారు. అయితే అక్కడకు వచ్చిన వారికి సరిపడా యూరియా బస్తాలు పంపిణీ చేయకపోవడంతో నిరాశ చెందారు. ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. రెండు నెలలుగా ఇన్ని బాధలు పడుతుంటే ప్రభుత్వానికి పట్టదా అని నిలదీస్తున్నారు. యూరియా వేసే సమయం దాటిపోతున్నా పట్టించుకోరా అని ప్రశ్నిస్తున్నారు.

మరో నాలుగు బార్లకు అనుమతి

విజయనగరం రూరల్: జిల్లాలో మరో నాలుగు బార్లకు అనుమతి మంజూరైంది. నూతన బార్ పాలసీ ప్రకారం కొత్త బార్లు ఏర్పాటు కోసం కలెక్టరేట్‌లో గురువారం లాటరీ తీశారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ రామసుందర్‌రెడ్డి పాల్గొని, ఆయన చేతులమీదుగా లాటరీ తీయించారు. జిల్లా వ్యాప్తంగా 31 బార్లు ఉండగా, వాటిలో 16 బార్లకు రెండు విడతల్లో లాటరీ ప్రక్రియ నిర్వహించి, లైసెన్స్ మంజూరు చేశారు. మిగిలిన 16 బార్లకు మూడో విడత కింద దరఖాస్తులు ఆహ్వానించగా గడువు ముగిసే సమయానికి నాలుగు బార్లకు 16 దరఖాస్తులు వచ్చాయి. ఈ మేరకు లాటరీ తీసి, కొత్త బార్లకు అనుమతులు ఇచ్చారు. దీని ద్వారా రూ.81.6 లక్షల ఆదాయం ఎక్సైజ్ శాఖకు ఆదాయం లభించినట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు.

మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

సంతకవిటి: మండల పరిధి మందరాడ గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై సచివాలయ ఉద్యోగిగా పని చేస్తున్న మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.గోపాలరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సచివాలయ ఉద్యోగిగా పని చేస్తున్న మహిళకు అస్సాంలో కేంద్రం ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్న గ్రామానికి చెందిన వ్యక్తితో పరిచయం ఏర్పడింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసి ఇపుడు పెళ్లి చేసుకోనని చెప్పడంతో గురువారం ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

చంద్రబాబు అబద్ధాలకు హద్దు లేదు

● జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మెడికల్ కళాశాలల ఏర్పాటు
● మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు పూర్తి వ్యతిరేకం
● విద్యార్థి, యువజన విభాగం నేతృత్వంలో నేడు చలో మెడికల్ కాలేజ్
● పోస్టర్లు ఆవిష్కరించిన మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



చలో మెడికల్ కాలేజీ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తదితరులు

చీపురుపల్లి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి అబద్ధాలు చెప్పడం గతం నుంచే వెన్నతో పెట్టిన విద్య అని కానీ ప్రస్తుత పరిపాలనలో అబద్ధాలకు హద్దులు లేకుండా పోతుండడం, దానికి అనుకూల మీడియా వంతపాడడం చూసి రాష్ట్ర ప్రజలు నవ్వుకుంటున్నారని మాజీ ఎంపీ, పీఏసీ మెంబర్ బెల్లాన చంద్రశేఖర్ ఎద్దేవా చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ విద్యార్థి, యువజన విభాగం నేతృత్వంలో ఈ నెల 19న శుక్రవారం తలపెట్టిన చలో మెడికల్ కాలేజీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను గురువారం ఆయన యువజన విభాగం, విద్యార్థి విభాగం ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబునాయుడు గతంలో మూడు సార్లు ముఖ్యమంత్రిగా పరిపాలన సాగించారని ఆ సమయంలో రాష్ట్రంలో ఒక్క ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మించలేదన్నారు. కానీ 2019 నుంచి 2024 మధ్య జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలల నిర్మాణం ప్రారంభించి 2023 నాటికే ఐదు మెడికల్ కళాశాలలు ప్రారంభించుకున్న విషయాన్ని గుర్తు చేశారు. అందులో భాగంగానే జిల్లా ప్రజలు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న విజయనగరంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు కావడం, ఈ ఏడాది మూడో బ్యాచ్ అడ్మిషన్లు కూడా ప్రారంభమవుతుండడం చంద్రబాబుకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలు కట్టలేని చంద్రబాబు ఉన్న కళాశాలలను ప్రైవేట్ పరం చేసేందుకు చూడడం అన్యాయమన్నారు.

విజయవంతం చేయాలి

పేదలకు మెరుగైన వైద్యం అందకూడదన్నదే చంద్రబాబు లక్ష్యమని దీనికి ప్రైవేటీకరణ నిదర్శనమన్నారు. అయితే పేదల పక్షాన నిరంతరం పోరాటం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు తలపెట్టిన చలో మెడికల్ కాలేజ్ కార్యక్రమానికి యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, యువజన విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, ఉపాధ్యక్షుడు బమ్మిడి కార్తీక్, వైఎస్సార్‌సీపీ నాయకులు పతివాడ రాజారావు, ముల్లు పైడిరాజు, మీసాల రామారావు, పొంద్రంకి వాసు, అప్పికొండ ఆదిబాబు, కొసిరెడ్డి రమణ, ఇప్పిలి తిరుమల, డి.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

21న అండర్ 14 క్రికెట్ జట్టు ఎంపిక

విజయనగరం: ఈనెల 21న అండర్-14 బాలుర జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి పి.సీతారామ రాజు (రాంబాబు) గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని బాబా మెట్ట శివారు విజ్జి స్టేడియంలో ఆదివారం ఉదయం 7 గంటలకు ఎంపికలు నిర్వహిస్తామన్నారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 2011 సెప్టెంబర్ 1 తర్వాత జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. క్రీడాకారులు వారి సొంత క్రికెట్ కిట్టు, ఒరిజినల్ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, మూడేళ్ల స్టడీ సర్టిఫికెట్స్ తీసుకురావాలని, అలాగే తెలుపు దుస్తులు ధరించి రావాలని స్పష్టం చేశారు.